

చేనేత పార్కు నుంచి మట్టిని తరలించడంతో ఏర్పడిన గుంతలు



చేనేత పార్కు నిర్మాణానికి కేటాయించిన స్థలంలో ఏర్పాటు చేసిన బోర్డు

కలగానే చేనేత పార్కు

జోగుళాంబ గద్వాల జిల్లాలో శిలాఫలకాలకే పరిమితం

- 2008లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన
- 2018లో మాజీ మంత్రి కేటీఆర్ మరో సారి శిలాఫలకం ఆవిష్కరణ
- రూ.52 కోట్లతో డీపీఆర్ తయారైనా లభించని ఆమోదం
- ఎదురుచూపులతోనే కాలం గడుపుతున్న చేనేత కార్మికులు

గద్వాల, ఏప్రిల్ 28: జోగుళాంబ గద్వాల జిల్లాలో నిర్మించతలపెట్టిన చేనేత పార్కు శిలాఫలకాలకే పరిమితమైంది. గద్వాల చేనేత జరీ చీరలకు దేశ.. విదేశాల్లో మంచి గుర్తింపు ఉంది. ఇక్కడి కార్మికులు నైపుణ్యం, నాణ్యమైన ముడిసరుకుతో చీరలు తయారు చేయడం వల్ల ఆ పేరు వచ్చింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది మంది చేనేత కార్మికులు నేత వృత్తిపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. వారి నైపుణ్యాన్ని వృద్ధి చేయడంతో పాటు.. ఆదాయాన్ని రెట్టింపు చేయాలనే తలంపుతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గద్వాలలో చేనేత పార్కును నిర్మించేందుకు స్థల సేకరణ చేసింది. గద్వాల మండలం పూడూరు రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 368/ఏలో 47.25 ఎకరాల భూమిని కేటాయించింది. ఇది గద్వాల-ఎర్రవల్లి ప్రధాన రహదారి అంచున ఉంటుంది. ఈ పార్కు నిర్మాణానికి రెండు సార్లు శంకుస్థాపనలు జరిగినా.. నిర్మాణం మాత్రం అడుగు ముందు పడలేదు.

రూ.52 కోట్లతో ప్రతిపాదనలు తయారు

కేటీఆర్ శంకుస్థాపన చేయడంతో అధికారులు పార్కులో పది ఎకరాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు తయారు చేశారు. హ్యాండ్లూమ్, పవర్‌లూమ్‌లకు కామన్ వర్క్ షెడ్, పరిపాలన భవనం, ప్రహరీ తదితర వాటిని నిర్మించేందుకు 2022లో రూ.52 కోట్లతో అంచనాలను తయారు చేశారు. అందులో మొదటి విడతగా రూ.21 కోట్లు అవసరం అవుతాయని ప్రభుత్వానికి డీపీఆర్‌ను తయారు చేసి పంపించారు. మాస్టర్ వీవర్స్ భాగస్వామ్యం ఉండాలనే ఉద్దేశంతో ప్రాజెక్టు విలువలో 30 శాతం వారు భరించాలని, మిగిలింది ప్రభుత్వం భరిస్తుందని ఒక ప్రతిపాదన.. లేదంటే ప్రభుత్వమే మొత్తం భరించి, బహిరంగ వేలం ద్వారా మాస్టర్ వీవర్స్‌కు అప్పగిస్తుందని ఇంకో ప్రతిపాదనతో డీపీఆర్‌ను తయారు చేసి ప్రభుత్వానికి నివేదించింది. కానీ ప్రస్తుతం ప్రభుత్వం మారింది. ప్రతిపాదించిన డీపీఆర్‌ను ఈ ప్రభుత్వం ఆమోదిస్తుందా? మళ్లీ కొత్త డీపీఆర్‌ను తయారు చేయమంటుందా? తెలియని పరిస్థితిలో అధికారులు ఉన్నారు. కార్మికులు మాత్రం చేనేత పార్కు కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

3,500 మగ్గాలు.. 11 వేల మంది కార్మికులు

ఉమ్మడి జిల్లాలో దాదాపు 3,500 మగ్గాలు ఉండగా.. 11 వేల మందికిపైగా కార్మికులు వాటిపై ఆధారపడి జీవనం గడుపుతున్నారు. వీరంతా గద్వాల బ్రాండ్‌తోనే జరీ చీరలు తయారు చేస్తున్నారు. రాజోలీ, అయిజ, గట్టు, గద్వాల, అలంపూర్, ఎక్లాస్‌పూర్, బూడిదపాడు, మాచర్ల, అమరచింత, కొత్తకోట, కోటకొండ తదితర ప్రాంతాలలో చేనేత మగ్గాలపై గద్వాల జరీ చీరలను తయారు చేస్తున్నారు. ఒక్క జోగుళాంబ గద్వాల జిల్లాలో 6,948 మంది చేనేత కార్మికులు ఉన్నారు. 14 చేనేత సంఘాలు ఉన్నాయి. వారిలో కాలానుగుణంగా నైపుణ్యాన్ని పెంచేందుకు శిక్షణ ఇవ్వడంతో పాటు హ్యాండ్లూమ్, పవర్‌లూమ్‌ల క్లస్టర్‌లను ఏర్పాటు చేయాలని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. మంత్రిగా ఉన్న డీకే అరుణ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డితో 2008 అక్టోబరు ఐదున చేనేత పార్కు కోసం శంకుస్థాపన చేయించారు. వెంటనే హద్దులు నిర్ణయించి, కంచె ఏర్పాటు కోసం రూ.50 లక్షల నిధులను విడుదల చేయించారు. ఆ తర్వాత రాజశేఖర్‌రెడ్డి మరణం, రోశయ్య, కిరణ్‌కుమార్ రెడ్డిల ప్రభుత్వం ఏర్పడటం.. తెలంగాణ ఉద్యమం తీవ్రతరం కావడంతో పాలకులు దీనిని పట్టించుకోలేదు. 2018, జనవరి 31న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి.. చేనేత, జౌళిశాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్‌ను గద్వాలకు పిలిపించి చేనేత పార్కుకు రెండోసారి శంకుస్థాపన చేయించారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



చేనేత పార్కు నిర్మాణం కోసం గత ప్రభుత్వంలో తయారు చేసిన డీపీఆర్ గురించి మంత్రి దృష్టికి తీసుకెళ్తాం. ఈ ప్రభుత్వం ఒక వేళ చేనేత కార్మికులకు హ్యాండ్లూమ్‌లతో పాటు ఇతర సదుపాయాలతో కొత్త డీపీఆర్‌ను తయారు చేయాలని చెబితే దాని ప్రకారం నడుచుకుంటాం. ప్రస్తుతం అయితే ఎన్నికల కోడ్ ఉన్నందున ఆ తర్వాతనే మంత్రి దృష్టికి తీసుకెళ్తాం.

- గోవిందయ్య, చేనేత, జౌళి శాఖ ఏడీ, గద్వాల

మట్టి మాఫియా చేతుల్లో పార్కు స్థలం

చాలా ఏళ్ల నుంచి చేనేత పార్కు స్థలం ఖాళీగా ఉండటంతో అక్రమార్కుల కన్నుదానిపై పడింది. మట్టి మాఫియా చాలా సార్లు ఈ స్థలం నుంచి మట్టిని తరలించడంతో అక్కడ పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. దీనిపై చాలాసార్లు చేనేత అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసినా.. రాత్రి సమయాల్లో మట్టిని, రాళ్లను తరలిస్తున్నారు. ఈ మధ్యకాలంలో అక్కడ మట్టిని తరలిస్తున్న ఓ మాజీ ప్రజాప్రతినిధికి చెందిన వాహనాలను పట్టుకొని, ఫైన్ కూడా వేశారు. కంచె లేకపోవడం, స్థలం వృథాగా ఉండటంతోనే అక్రమార్కుల దృష్టి దానిపై పడుతున్నదని కార్మికులు వాపోతున్నారు.

గురుకుల కళాశాలల ప్రవేశ పరీక్ష ప్రశాంతం

- మహబూబ్‌నగర్‌లో 12 కేంద్రాల ఏర్పాటు
- సెంటర్లను పరిశీలించిన డీఈవో రవీందర్, ఆర్‌సీవో వెంకట్‌రెడ్డి
- 89.9 హాజరు శాతం నమోదు



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో రవీందర్, ఆర్‌సీవో వెంకట్‌రెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 28: మహాత్మాజ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఆదివారం మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. 12 కేంద్రాలను ఏర్పాటు చేశారు. నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదన్న నిబంధన ఉండటంతో విద్యార్థులు గంట ముందే కేంద్రాలకు చేరుకున్నారు. వారి వెంట తల్లిదండ్రులు, బంధువులు రావడంతో కేంద్రాల వద్ద సందడి నెలకొంది. జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు 1,908 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1,696 మంది హాజరయ్యారు. 212 మంది గైర్హాజరు అయ్యారు. డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు 847 మంది హాజరు కావాల్సి ఉండగా.. 755 మంది హాజరయ్యారు. 92 మంది గైర్హాజరు అయ్యారు. మొత్తం 2,755 మందికి గాను 2,451 మంది హాజరు కాగా.. 304 మంది గైర్హాజరు అయ్యారు. 89.9 హాజరు శాతం నమోదైంది. డీఈవో ఎ.రవీందర్, ఉమ్మడి జిల్లా ఆర్‌సీవో వెంకట్‌రెడ్డి జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల, ఎన్‌టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల కేంద్రాలను తనిఖీ చేశారు.

త్వరలో పోడు భూములకు పట్టాలు

- నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లు రవి



అక్కారం గ్రామంలో ప్రచారంలో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి మల్లు రవి, ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేటటౌన్, ఏప్రిల్ 28: గిరిజన తండాలలో ఉన్న పోడుభూములకు త్వరలో పట్టాలిస్తామని నాగర్ కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లు రవి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని బక్కలింగాయ్యపల్లి, అక్కారం, ఆంజనేయతండా, ఘనపూర్, మన్నేవారిపల్లి, సిద్దాపూర్, బొమ్మన్‌పల్లి, చందాపూర్, నడింపల్లి, హాజీపూర్ గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల్లో రోడ్ షోలలో మాట్లాడారు. నల్లమల ప్రాంతంలోని గిరిజనుల పోడు భూములకు పట్టాలిచ్చి తీరుతామన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పోడు భూములకు పట్టాలిచ్చామని, మళ్లీ అదే తరహాలో ఇస్తామని గిరిజనులకు హామీ ఇచ్చారు.

నల్లమలలో లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి ప్రతీ ఎకరాకు సాగు నీరందిస్తామన్నారు. ఇల్లు లేని వాళ్లందరికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇచ్చి తీరుతామన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఏర్పడిన కొన్ని రోజుల్లోనే మహిళలకు అండగా నిలిచి ఉచిత బస్సు ప్రయాణంతో పాటు రూ 500లకే గ్యాస్ సిలిండర్ అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. ప్రతీ ఒక్కరు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మల్లు రవిని గెలిపించి దేశంలో రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలకు రైతులకు పెద్ద పీట వేస్తోందన్నారు. మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పించి మహిళలకు అండగా నిలిచిందన్నారు.

అదేవిధంగా రైతులకు నాణ్యమైన 24గంటల కరెంట్ అందిస్తున్నామన్నారు. త్వరలో ముఖ్యమంత్రి చెప్పినట్టుగా రైతులు తీపికబురు వింటారన్నారు. రైతులకు అండగా నిలుస్తూ వరికి మద్దతు ధరతో పాటు బోనస్ అందించనున్నట్లు తెలిపారు. ప్రతీ ఒక్కరు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి పార్లమెంట్ అభ్యర్థి మల్లు రవిని గెలిపించాలని కోరారు. నాయకులు రామనాథం, గోపాల్ రెడ్డి, రాజేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్ర భానుడు





తాటికొండ శివారులోని బావిలో ఈత కొడుతున్న యువకులు

- రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- మహబూబ్‌నగర్ జిల్లాలో 41 డిగ్రీలకు పైగా నమోదు
- అల్లాడిపోతున్న ఉమ్మడి జిల్లా ప్రజలు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 28 : మండుతున్న ఎండలతో ఉమ్మడి పాలమూరు ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం 8.30 గంటల నుంచే ఎండ తీవ్రత పెరుగుతోంది. మధ్యాహ్నం 12 గంటల తర్వాత ఇంటి నుంచి అడుగు బయట పెట్టే పరిస్థితి ఉండటం లేదు. దీంతో ఎక్కువ మంది ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఇళ్లలోనూ ఉక్కపోత ఎక్కువవడంతో ఫ్యాన్‌లు, కూలర్లు ఉన్నా పెద్దగా ఫలితం లేని పరిస్థితి నెలకొన్నది. మహబూబ్‌నగర్ జిల్లాలోని సీసీకుంటలో 44.1, బాలనగర్‌లో 44 డిగ్రీలుగా నమోదు కాగా, అడ్డాకులలో 43.4, కోయిలకొండలో 43.3, మిడ్జిల్‌లో 43.1, మహబూబ్‌నగర్‌లో 43 డిగ్రీలు నమోదైంది. జడ్చర్లలో 42.2, భూత్పూర్‌లో 42.8 డిగ్రీలుండగా, జిల్లాలో అత్యల్పంగా నవాబ్‌పేటలో 40.1 గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

ఈతతో సేదతీరుతున్న యువకులు

భూత్పూర్: ఎండ వేడి నుంచి ఉపశమనం పొందేందుకు గ్రామాల్లో యువకులు, పిల్లలు బావుల్లో ఈత కొడుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం తాటికొండ గ్రామ శివారులో గల ఓ బావిలో పాలమూరు పట్టణం నుంచి వచ్చిన యువకులు ఈత కొట్టారు. 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఈత కొడుతూ సేదతీరుతున్నారు. వాహనాల్లో వచ్చి ఈత కొడుతున్నారు.

- నారాయణపేట జిల్లావ్యాప్తంగా ఆదివారం ఎండ మరింత తీవ్రమైంది. గరిష్ఠ ఉష్ణోగ్రత 43 డిగ్రీలుండగా, కనిష్ఠం 29 డిగ్రీలుగా నమోదయ్యింది. కోస్గి మండలంలో 41, మక్తల్‌లో 42, నర్వలో 42, కృష్ణలో 43 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదయ్యింది. జిల్లాలో మరో ఐదు రోజుల పాటు తీవ్రమైన వడగాలులతో పాటు ఉష్ణోగ్రత గరిష్ఠంగా 45 డిగ్రీలకు చేరుకోనే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు.
- వనపర్తి జిల్లా, కొత్తకోట మండల పరిధిలోని కానాయపల్లిలో అత్యధికంగా 43.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. పానుగల్ 43.7 , శ్రీరంగాపూర్ 43.4, మదనాపూర్ 43.0, చిన్నంబావి 42.8, పెబ్బేరు 42.6, ఆత్మకూరు, అమరచింత 42.5 గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదయ్యింది. పెద్దమందడి 42.4, గోపాల్‌పేట, వనపర్తి 41.9, రేవల్లి, ఘణపూర్, వీపనగండ్ల మండలంలో 41.2 డిగ్రీలుగా ఉంది. కనిష్ఠ ఉష్ణోగ్రత 25.1లుగా నమోదయ్యింది.
- నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆదివారం అత్యధికంగా కోడేరు మండలంలో 43.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదయ్యింది. బిజినేపల్లిలో 43.3, అచ్చంపేటలో 42.5, కొల్లాపూర్‌లో 41.9, కల్వకుర్తిలో 41.8, పెంట్లవెల్లిలో 41.7, పెద్దకొత్తపల్లిలో 41.5, చారకొండలో 41.1, ఉప్పునుంతలలో 40.9, పదరలో 40.3, నాగర్‌కర్నూల్‌లో 40.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.
- జోగుళాంబ గద్వాల జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. అత్యధికంగా ధరూరులో అత్యధికంగా 44.2 డిగ్రీల ఉష్ణోగ్రత కాగా, అత్యల్పంగా గట్టులో 40.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇటిక్యాలలో 44 డిగ్రీలు, అలంపూర్‌లో 43.9 డిగ్రీలు, గద్వాలలో 43.2డిగ్రీలు, ఉండవల్లిలో 43.1 డిగ్రీలు, కేటిదొడ్డి, వడ్డేపల్లి మండలాల్లో 43 డిగ్రీలు, అయిజ, మల్దకల్ మండలాల్లో 42.3 డిగ్రీలు, రాజోలి 41.8 డిగ్రీలు, మానవపాడులో 41.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లిలో మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా మారిన రోడ్డు



పట్టుబడ్డ మొసలి

భారీ మొసలి పట్టివేత

కొత్తకోట, ఏప్రిల్ 28: వనపర్తి జిల్లా కొత్తకోట మండలం భూత్పూర్ గ్రామంలో ఆదివారం భారీ మొసలిని బంధించారు. గ్రామానికి చెందిన నాగరాజు వరి పొలానికి శేఖర్ నీళ్లు పెట్టడానికి వెళ్లాడు. మొసలిని గమనించి, భయపడి, తోటి రైతులకు చెప్పాడు. విషయం తెలుసుకున్న యువకులు జిల్లా కేంద్రంలోని స్నేక్ సొసైటీ నిర్వాహకుడు, హోంగార్డు కృష్ణ సాగర్‌కు సమాచారం ఇచ్చారు. కృష్ణ సాగర్ గ్రామానికి వచ్చి, యువకుల సహాయంతో రెండు గంటల పాటు శ్రమించి మొసలిని తాళ్లతో బంధించారు. అది 185 కిలోల బరువు ఉంది. ఎస్పీ రక్షిత కె మూర్తి ఆదేశాల మేరకు మొసలిని జూరాల ప్రాజెక్టులో వదిలేయడానికి తీసుకెళ్లారు. మొసలిని చాకచక్యంగా బంధించిన కృష్ణసాగర్‌ను గ్రామస్థులు అభినందించారు. జూరాల ప్రాజెక్టు, రామన్‌పాడు రిజర్వాయర్ కాల్వల పరివాహక ప్రాంత రైతులు, పశువులు, గొర్రెల కాపరులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ చెప్పారు. మొసలిని బంధించిన వారిలో ఆ గ్రామ యువకులు గోపాల్, నరసింహ, సాయి, అవినాష్, శివ ఉన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- నాగర్‌కర్నూల్ పార్లమెంటు అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

పాన్‌గల్, ఏప్రిల్ 28 : బీఆర్ఎస్ పార్టీతోనే తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని నాగర్‌కర్నూల్ పార్లమెంటు అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని మల్లాయిపల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం అయిదు గ్యారెంటీల పేరుతో కేంద్రంలో అధికారం లోకి రావాలని చూస్తుందన్నారు. అబద్ధాల కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పి కారు గుర్తుకు ఓటు వేసి తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సోషల్ మీడియా ఇన్‌చార్జి అభిలాష్‌రావు, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ అంజనేయులుగౌడ్, నాయకులు పాల్గొన్నారు.



మల్లాయిపల్లిలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

క్రీడా స్ఫూర్తి చాటాలి

గట్టు, ఏప్రిల్ 28: క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని చాటాలని గట్టు జడ్పీటీసీ సభ్యురాలు బాసు శ్యామల అన్నారు. మండల పరిధిలోని బల్గెర గ్రామంలో దిగంబర స్వామి జాతర సందర్భంగా 11రోజులుగా నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ మ్యాచ్ పోటీలు ముగిశాయి. ఆదివారం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జడ్పీటీసీ సభ్యురాలు మాట్లాడుతూ చక్కటి వాతావరణంలో 11 రోజులుగా క్రీడాకారులు క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మొదటి విజేతగా నోబెల్ కింగ్స్ గెలుపొందడంతో రూ. 40 వేల నగదు, షీల్డ్‌ను జడ్పీటీసీ అందజేశారు. ద్వితీయ విజేతగా శివాజీ కింగ్స్ గెలుపొందడంతో ఎంపీటీసీ సభ్యురాలు రూపవతి కిష్టప్ప రూ. 20వేల నగదు, షీల్డ్‌ను అందజేశారు. తృతీయ విజేతగా పంచముఖి బ్రిక్స్ నిలువడంతో రూ. 10 వేల నగదును బాసు నాయుడు అందజేశారు. క్రికెట్ పోటీలు విజయవంతగా ముగిసినందుకు నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు హన్మంతునాయుడు, నాయకులు కిష్టప్ప, రాజు, పొగాకు ఈరన్న, వీరారెడ్డి, ఈరన్న, డేవిడ్, బుగ్గల్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన



భీమవరంలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై నాగరాజు

అలంపూరు ఏప్రిల్ 28: బాలికలను వేధిస్తే కఠిన శిక్షలు ఉన్నాయని ఎస్సై నాగరాజు అన్నారు. పోలీసింగ్ కమ్యూనిటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల పరిధిలోని భీమవరం గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ బాలికలను వేధిస్తే పోక్సో కేసు నమోదు అవుతుందని, ఏడు సంవత్సరాలు జైలు శిక్ష ఉంటుందన్నారు. అలాగే పలు చట్టాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో పోలీస్‌సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అంతంపల్లి గ్రామంలో..

గట్టు: మండల పరిధిలోని అంతంపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఎస్సై రామకృష్ణ 41ఏ సీఆర్‌పీసీ నోటీస్‌పై అవగాహన కల్పించారు. అనంతరం పోలీస్ కళాజాత ఆధ్వర్యంలో పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పోలీస్ సిబ్బంది, కళాబృందం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో జిల్లాకు చాంపియన్‌షిప్

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 28: సూర్యాపేట జిల్లాలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారులకు ఓవరాల్ చాంపియన్ షిప్ లభించింది. రాష్ట్ర స్థాయి స్ప్రింట్, మిడిల్, లాంగ్ డిస్టెన్స్ పోటీల్లో జిల్లా నుంచి 25 మంది క్రీడాకారులు పాల్గొనగా అందులో 14 మంది అథ్లెట్లు వివిధ విభాగాల్లో పతకాలు సాధించారు. అండర్-20 విభాగం 100 మీటర్ల పరుగులో ఎం.మనీషా స్వర్ణం, జి.కల్పన కాంస్యం పతకాలు సాధించగా 800 మీటర్ల పరుగులో ఎం.పూజ స్వర్ణం, 1500 మీటర్ల పరుగులో ఎం.బాబు రజతం, 3000 మీటర్ల పరుగులో ఎన్.అనూష రజతం, పి.ఉషారాణి కాంస్య పతకాలు పొందారు. అదే విధంగా అండర్-18 విభాగం 100 మీటర్ల పరుగులో ఎ.గణేష్ రజతం, 2000 మీటర్ల పరుగులో కె.స్వప్న స్వర్ణం, ఆర్.కీర్తన కాంస్య పతకాలు అందుకున్నారు. అండర్-16 విభాగం 100 మీటర్ల పరుగులో ఎ.నక్షత్ర స్వర్ణం, ఎం.భానుప్రసాద్ రజతం, 2000 మీటర్ల పరుగులో బి.మధుప్రియ రజతం, డి.సంతోష్‌కుమార్ కాంస్య పతకాలు సాధించారు. అలాగే అండర్-14 విభాగం 600 మీటర్ల పరుగులో జె.గంగోత్రి కాంస్య పతకం అందుకుంది. జిల్లా క్రీడాకారులు మొత్తం 14 పతకాలు, 46 పాయింట్లతో ఓవరాల్ చాపియన్ షిప్ సాధించడం పట్ల జిల్లా అథ్లెటిక్స్ అధ్యక్షుడు డాక్టర్ ఎం.వి జేందర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి సోలపోగుల స్వాములు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.



అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ అందుకున్న నాగర్‌కర్నూల్ జిల్లా క్రీడాకారులతో కోచ్‌లు




పరుగు పందెంలో బంగారు పతకం సాధించిన బసంత్

● **నారాయణపేట /మక్తల్ :** సూర్యపేట జిల్లాలో జరిగిన మూడవ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ మిడిల్ లాంగ్ డిస్టెన్స్ చాంపియన్ షిప్ పోటీల్లో 14 ఏళ్లలోపు బాలుర విభాగంలో 600 మీటర్ల పరుగు పందెంలో మక్తల్ పట్టణానికి చెందిన బసంత్‌కు బంగారు పతకం వరించింది. అదే విధంగా మహిళా విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో శ్రీలతకు కాంస్య పతకం లభించింది. ఈ సందర్భంగా పతకాలు సాధించి జిల్లాకు పేరు తీసుకొచ్చిన క్రీడాకారులను అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రమణ, నందునామాజీ, వెంకటేష్, అంబ్రేష్, నర్సింహులు, జగదీష్, జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేష్ శెట్టి, బీకేఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, కాంగ్రెస్ నాయకులు గవినోళ్ల బాలక్రిష్టా రెడ్డి అభినందించారు.

కెమెరా కంటికి చిక్కిన చిరుతలు

బిజినేపల్లి, ఏప్రిల్ 28 : కొంతకాలంగా గంగారం ఫారెస్టులోకి చిరుతల సంచారం కలకలం రేపుతుంది. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం గంగారం ఫారెస్టు సమీప తండాల్లోని పశువులపై చిరుతలు దాడి చేసిన ఘటనలతో అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని హడలిపోయారు. ఆదివారం గంగారం ఫారెస్టులో అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన కెమెరాలకు చిరుత పులులు సంచారం చేస్తున్న ఫొటోలు హల్‌చల్ చేస్తున్నాయి. గంగారం ఫారెస్టులోని నేరేడువంపు సమీపంలో ఉన్న సోలార్ పంపుసెట్ వద్దకు మంచినీరు తాగేందుకు వచ్చిన చిరుతలు కెమెరా కంటికి చిక్కాయి. అలాగే చిరుతలతో పాటు సాంబారుల ఫొటోలు కూడా కెమెరాలో బంధించారు. గంగారం ఫారెస్టులో పూర్తిస్థాయిలో కెమెరాల ద్వారా చిరుత పులుల సంఖ్యను గుర్తించి అందుకు అనుగుణంగా ఫారెస్టు అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలని అటవీ సమీప తండావాసులు కోరుతున్నారు.



గంగారం ఫారెస్టులోని నేరేడు వంపు వద్ద మంచినీరు తాగేందుకు వచ్చిన చిరుత

చిరుత దాడిలో లేగ దూడ మృతి

కొత్తపల్లి : చిరుత దాడిలో లేగ దూడ మృతి చెందింది. ఈ సంఘటన నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలం గొర్లోనిబావి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని గొర్లోనిబావి గ్రామానికి చెందిన కావలి అంజిలయ్యకు చెందిన వ్యవసాయ పొలం భూనీడు గ్రామ శివారులో ఉంది. రోజు మాదిరిగా శనివారం రాత్రి పశువులను కట్టివేసి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం పొలం దగ్గరికి వెళ్లి చూడగా లేగ దూడ మృతి చెంది ఉండడాన్ని గమనించి బోరున విలపించారు.



గొర్లోనిబావి గ్రామంలో మృతి చెందిన దూడ

ఆవును చంపిన పెద్దపులి

పెద్దకొత్తపల్లి : ఆవును పెద్దపులి చంపి తిన్న సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని చంద్రబండతండా పెద్దవాగు సమీపంలో జరిగింది. ఆదివారం ఆవుల కాపరి తెలిపిన వివరాల ప్రకారం... మారేడమానుదిన్నె గ్రామానికి చెందిన సొప్పరి బాలయ్య తన ఆవుల మందను చంద్రబండతండా సమీపంలో ఉంచారు. రోజువారిగా ఆవుల మందను మేపుకురావడానికి లింగాల మండలం రాయవరం సమీపంలోకి వెళ్లారు. ఆవుల గుంపులో నుంచి ఒక ఆవు లేగదూడ కోసం తిరిగి వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఆవును వెతకగా చంద్రబండతండా పెద్దవాగు సమీపంలో పెద్దపులి చంపి తిన్నట్లు పులి కాలు జాడలు గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. సుమారు ఆవు విలువ 30వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు. తన ఆవును పెద్దపులి చంపడంతో ఆవుల కాపరి భయాందోళన చెందుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవాబ్‌పేటలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

నవాబ్‌పేట, ఏప్రిల్ 28 : మండల కేంద్రంలోని నవాబ్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం వారు చదువుకున్న పాఠశాలలో సమావేశమై నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. 2004-05 బ్యాచ్‌కు చెందిన పలువురు విద్యార్థులు నాటి గురువులు చెప్పిన మాటలను, వారు ఆడుకున్న ప్రదేశాలను గుర్తు చేసుకున్నారు. జీవితంలో విద్యార్థి దశ మరిచిపోలేనిదని అన్నారు. అనంతరం గురువులకు సన్మానించగా, జీవితంలో ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని గురువులు వారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాడెమోని రాజు తదితరులు పాల్గొన్నారు.



జడ్చర్లలో పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

● మిడ్జిల్ (జడ్చర్ల) : జడ్చర్ల పట్టణంలోని నాగార్జున పాఠశాల 2003-04 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు సమావేశమయ్యారు. అప్పటి విద్యార్థి, ప్రస్తుతం జడ్చర్ల మునిసిపాలిటీ కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఓ హోటల్‌లో ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు రాజశేఖర్‌రెడ్డి, శ్రీహరి, నరేందర్, జంగయ్యను సన్మానించారు. పాఠశాలలో విద్యనేర్పిన ఉపాధ్యాయుడు జంగయ్యకు రూ. 20వేల ఆర్థిక సాయం అందజేశారు. పూర్వవిద్యార్థులు కరుణాకర్, సుభాష్, నరేష్, శివరాం, మధుసూదన్, రాఘవేందర్, మహేష్ ఉన్నారు.

పెండింగ్ డబ్బులు అందేనా?

- **నాలుగు నెలలుగా ఉపాధి కూలీలకు అందని డబ్బులు**
- **సాఫ్ట్‌వేర్ సమస్య ఉత్పన్నం**
- **ఉన్నతాధికారులకు చెప్పి పరిష్కరిస్తామంటున్న అధికారులు**

హన్వాడ, ఏప్రిల్ 28 : మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో పని చేసిన కూలీలకు నాలుగు నెలల పెండింగ్ కూలి డబ్బులు అందడం లేదు. 2023 సంవత్సరం జూలై, ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో ఉపాధి హామీ పథకంలో పని చేసిన కూలీలకు ఆ నాలుగు నెలలకు సంబంధించిన కూలి డబ్బులు అందలేదు. కొందరికి బ్యాంకుల ద్వారా, మరికొందరికి పోస్టాఫీసు ద్వారా డబ్బులు చెల్లిస్తారు. పైన పేర్కొన్న నాలుగు నెలలకు ముందున్న సాఫ్ట్‌వేర్ వల్ల కూలీల వేలిముద్రలు తీసు కొని వారికి డబ్బులు చెల్లించే వారు. ఉన్నట్లుండి ప్రభుత్వం అప్పటి వరకు ఉన్న డీక్యూబ్ సాఫ్ట్‌వేర్‌ను మార్చి మరో సాఫ్ట్ వేర్‌ను అమలు చేయాలని ఆదేశించింది. దీంతో అప్పటి వరకు ఉన్న వేలిముద్రల సేకరణ తీసేసి, ఓచర్ రాయించుకొని కూలీలు



హన్వాడలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు



హన్వాడ పోస్టాఫీస్

డబ్బులు ఇవ్వాలని ఆదేశాలు వచ్చాయి. అలా పలు గ్రామాల్లోని కొందరు కూలీలు డబ్బులు తీసుకున్నారు. ఇదంతా కొత్తగా వచ్చిన సాఫ్ట్‌వేర్ సమస్య మూలంగా కొందరికి అందలేదని పోస్టాఫీస్ సిబ్బంది చెప్పుతున్నారు. ఆ నాలుగు నెలల తర్వాత నవంబరు నుంచి నేటి వరకు పని చేసిన కూలీలకు డబ్బులు యధావిధిగా వస్తున్నాయి. హన్వాడ, నాయినోనిపల్లి, సల్లోనిపల్లి, టంకర, దాచకపల్లితో పాటు మరి కొన్ని గ్రామాలలోని కూలీలకు డబ్బులు అందలేదు. కాగా డీక్యూబ్ సాఫ్ట్‌వేర్‌లో కూలీలకు కూలీ డబ్బు లు ఇచ్చిన వారి అకౌంట్‌లో కట్ కాలేకపోవడంతో సిబ్బందికి తేడా వచ్చింది. దీంతో ఆ నాలుగు నెలల పేమెంట్ ఇవ్వలేదని పోస్టాఫీస్ సిబ్బంది తెలిపారు. బ్యాంక్ ఖాతాలు ఉన్న వారికి రెగ్యులర్‌గా కూలి డబ్బులు వస్తున్నాయి.

సమస్య పరిష్కారానికి చర్యలు

మండలంలోని కొన్ని గ్రామాలలో కొందరి కూలీలకు ఆ నాలుగు నెలల కూలీ డబ్బులు అందలేదు. ఈ సమస్యను పరిష్కరించి కూలీలకు డబ్బులు అందేవిధంగా చర్యలు తీసుకుంటా. కూలి డబ్బులు అందని వారి వివరాలు మా సిబ్బందితో సేకరించి సీఆర్‌డీకి పంపించి ఇప్పిస్తా.

- హైమావతి, ఏపీవో

కూలి డబ్బులు రావాలి

నాలుగు నెలల కూలీ డబ్బులు దాదాపుగా ఏడు వేల రూపాయలు నాకు రావాలి. ఆఫీస్‌లో సమస్య ఉందని కూలి డబ్బులు ఇవ్వడం లేదు. ఎంతో కష్టపడి పనిచేసిన. డబ్బులు రాకపోతే ఎలా. మా ఇబ్బందులను చూసైనా అధికారులు స్పందించి డబ్బులు ఇప్పించేలా చూడాలి.

- యశోద కూలీ, దాచకపల్లి

కేజీబీవీ ఎస్‌వో, ముగ్గురు సిబ్బంది తొలగింపు

ధరూరు, ఏప్రిల్ 28 : గద్వాల జిల్లా ధరూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారి యాదమ్మతో పాటు అక్కడే పనిచేస్తున్న సీఆర్‌టీగా విధులు నిర్వహిస్తున్న ఎం.జి విజయలక్ష్మి, మరో ఉద్యోగి ఎం.జ్యోతి, అటెండర్ హలీంబేగంలను విధుల నుంచి తొలగిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ఇందిర ఈ నెల 25న ఉత్తర్వులు జారీచేయగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కేజీబీవీలోని 'నిత్యావసర వస్తువులు పక్కదారి' పట్టడంతో అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. వస్తువులు రాత్రివేళ పక్కదారి పట్టినట్లు పక్కా సమాచారాన్ని సేకరించిన అదనపు కలెక్టర్ బాధ్యులను సర్వీసు నుంచి తొలగించాలని డీఈవోను ఆదేశించడంతో తక్షణ చర్యలు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఎర్రవల్లి, ఏప్రిల్ 28: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల పరిధిలోని బీచుపల్లి వద్ద శనివారం రాత్రి చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించి ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం అన్నారం గ్రామానికి చెందిన మల్లిఖార్జున్ గౌడ్(35) బీచుపల్లి దగ్గర 44వ జాతీయ రహదారి దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. దాంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం గద్వాల అసుపత్రికి తరలించారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- తులం బంగారం, 15 తులాల వెండి, రూ. 30వేల నగదు అపహరణ

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 28 : తాళం వేసిన ఇంట్లో తాళాలు విరగ్గొట్టి తులం బంగారం, 15తులాల వెండి, 30వేల నగదు అపహరించుకుని వెళ్లిన సంఘటన నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడలో చోటు చేసుకున్నట్లు ఎస్ఐ గోవర్ధన్ ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం... ఉయ్యాలవాడకు చెందిన కాకునూరి నాగమ్మ ఇంటికి తాళం వేసి ఆరు బయట నిద్రిస్తుండగా గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలు విరగ్గొట్టి ఇంట్లోకి ప్రవేశించి తులం బంగారం, 30వేల నగదు, 15తులాల వెండిని అపహరించుకొనిపోయినట్లు ఎస్ఐ తెలిపారు. నాగమ్మ నిద్ర లేచి చూసేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా దొంగతనం జరిగినట్లు గుర్తించారు. ఈ సంఘటనపై నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు.

మహిళకు పాము కాటు

నవాబ్‌పేట, ఏప్రిల్ 28 : మండలంలోని రుక్కంపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ పాముకాటు గురవడంతో కుటుంబ సభ్యులు గుర్తించి సకాలంలో జిల్లా ఆసుపత్రికి తరలించారు. గ్రామానికి చెందిన వడ్డె ఎలమ్మ శనివారం ఇంటి బయట ఉండగా పంటపొలాల నుంచి పాము ఇంట్లోకి వచ్చే క్రమంలో ఎల్లమ్మకు తాకడంతో అనుమానం వచ్చి చూడగా పాము కనిపించడంతో ఇరుగు పొరుగు వారి సహాయంతో పామును చంపి అక్కడి నుంచి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని జిల్లా ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

గడ్డి వాము దగ్ధం



పర్దీపూర్‌లో గడ్డివాము దగ్ధం

చిన్నచింతకుంట, ఏప్రిల్ 28 : మండలంలోని పర్దీపూర్ గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గడ్డివాము దగ్ధమైంది. దాదాపు నాలుగు ట్రాక్టర్ల గడ్డి ఉంటుందని, రూ. 50 వేల నష్టం జరిగిందని బాధితుడు తెలుగు రమేష్ వాపోయాడు. తనను ఆదుకోవాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు.

హన్వాడ గ్రామంలో..

హన్వాడ: హన్వాడ గ్రామానికి చెందిన కోస్గి వెంకటయ్య అనే రైతుకు చెందిన రెండు గడ్డి వాములు ఆదివారం తెల్లవారుజామున కాలిపోయాయి. అగ్గి ఎలా అంటుకుందో తెలియదని బాధితుడు వెంకటయ్య తెలిపారు. దాదాపుగా లక్ష రూపాయల విలువ గల గడ్డి దగ్ధమైందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరారు.

వాహనాల తనిఖీల్లో పట్టుబడిన నగదు



చారకొండలో పట్టుబడిన నగదుతో ఎస్ఐ రాజశేఖర్

చారకొండ, ఏప్రిల్ 28: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో భాగంగా పోలీసులు వాహనాల తనిఖీని ముమ్మరం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన అంతర్‌జిల్లా చెక్‌పోస్టు వద్ద ఎస్ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. చెక్‌పోస్టు వద్ద రూ. 2.52 లక్షలు నగదు పట్టుబడిందని ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. అల్లంపల్లి అరుణ్‌కుమార్ బైక్‌పై డిండి నుంచి చారకొండ మీదుగా దేవరకొండకు వెళ్తుండగా తనిఖీ చేయడంతో నగదు పట్టుబడినట్లు తెలిపారు. నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు అతని వద్ద లేకపోవడంతో డబ్బును జిల్లా గ్రీవెన్స్ సెల్‌కు పంపించినట్లు ఎస్ఐ రాజశేఖర్ పేర్కొన్నారు.

● **మన్ననూరు:** నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని మన్ననూర్ సమీపంలో ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రంలో ఆదివారం సాయంత్రం అధికారులు రూ.50 వేల నగదును సీజ్ చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన యోగి బల్ల బగారి శ్రీశైలం వెళుతుండగా వాహనాల తనిఖీ సందర్భంలో వారి వద్ద నుంచి డబ్బులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. సరైన ఆధారాలు చూపించకపోవడంతో అట్టి డబ్బులను సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

టోల్‌ప్లాజా వద్ద మద్యం పట్టివేత

అలంపూర్ చౌరస్తా : ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద ఆదివారం అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాసనాయక్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం... అలంపూర్ మండల, కోనేరు గ్రామానికి చెందిన మురళీ మోహన్‌ఆచారి, కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలానికి చెందిన నల్లబోతుల మధు, నంద్యాల జిల్లా పగిడాలకు చెందిన ఈడిగ నాగేంద్రగౌడ్ టోల్‌ప్లాజా సమీపంలో ఉన్న వైన్స్ షాపుల సమయం ముగిసిన తర్వాత తాము విక్రయిస్తున్న స్నాక్స్, వాటర్‌బాటిల్స్ నడుమ మద్యం దాచి విక్రయిస్తున్నారు. సమాచారం అందుకొని ఆదివారం తెల్లవారుజామున పోలీసులు దాడులు చేసి ముగ్గురి బెల్ట్ షాపుల నుంచి 300.870లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.1,48,170లుగా నిర్ధారించారు.

నేడు రామేశ్వర స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామి షష్టి ఉత్సవాలు

రాజోలి, ఏప్రిల్ 28 : రాజోలి శివారులో ఉన్న తుంగభద్ర నది మధ్యలో ఉన్న శ్రీ రామేశ్వర స్వామి ఆలయంలో నేడు (సోమవారం) సుబ్రహ్మణ్య స్వామి షష్టి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు అడివిస్వామి ఆదివారం తెలిపారు. ఆలయానికి రంగులు వేసి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. తుంగభద్ర నదిలో నీరు పూర్తి ఎండిపోవడంతో నేరుగా ఆలయం దగ్గరకు వాహనాలు వెళ్లే విధంగా దారి ఏర్పాటు చేసినట్లు చేశారని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని అర్చకులు అడివిస్వామి కోరారు.

ఊరేగింపుగా సిర్సనగండ్లకు సీతారామచంద్రస్వామి ఉత్సవ విగ్రహాలు



పల్లకీలో ఉత్సవ విగ్రహాలను సిర్సనగండ్లకు తీసుకెళ్తున్న భక్తులు

చారకొండ, ఏప్రిల్ 28: సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి ఉత్సవాలు ఈ నెల 16 నుంచి 22 వరకు అంగరంగ వైభవంగా జరిగాయి. శ్రీరామనవమి సందర్భంగా సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవంలో భాగంగా ఆదివారం ఆలయ చైర్మన్ దేరం రామశర్మ, ఈవో మల్లెల రఘు ఆధ్వర్యంలో స్వామి వారికి 16 పండుగ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి పంచామృతభిషేకం, అలంకరణ, తులసి సహస్రనామార్చన కార్యక్రమాలు నిర్వహించారు. సీతారాచంద్రస్వామి ఆలయం నుంచి అర్చకులు డప్పు, బ్యాండు మేళాలు, కోలాటాల నడుమ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో పెట్టి ఊరేగింపుగా సిర్సనగండ్ల గ్రామానికి తీసుకెళ్లి ఆంజనేయ స్వామి ఆలయంలో పెట్టినట్లు ఆలయ చైర్మన్ దేరం రామశర్మ తెలిపారు. ఆలయ అర్చకులు దేరం మురళీధర్‌శర్మ, దేరం లక్ష్మణశర్మ, దేరం వేణుశర్మ, దేరం అనంతరామశర్మ, దేరం కోదండరామశర్మ, దేరం ప్రవీన్‌శర్మ, దేరం గోపిశర్మ, దేరం ఆనందశర్మ, భక్తులు, సిర్సనగండ్ల గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

చారకొండలో బీఆర్‌ఎస్‌కు భారీ షాక్

● ఎంపీపీ గుండె నిర్మల, పీఏసీఎస్ చైర్మన్ జెల్ల గురువయ్యతో పాటు 50 మంది బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరిక



ఎంపీపీ గుండె నిర్మలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

చారకొండ, ఏప్రిల్ 28: మండలంలో బీఆర్‌ఎస్ పార్టీకి ఆ పార్టీ నాయకులు భారీ షాక్ ఇచ్చారు. జడ్పీ వైస్‌చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి చారకొండ వెంకటేష్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సమక్షంలో ఎంపీపీ గుండె నిర్మల, పీఏసీఎస్ చైర్మన్ జెల్ల గురువయ్యగౌడ్, మాజీ సర్పంచులు గుండె విజేందర్‌గౌడ్, అంగోత్ నరేష్ నాయక్, అలివేల శ్రీను. ఎంపీటీసీ లలితబాలుసింగ్, మాజీ ఉపసర్పంచ్ రాణి నరేందర్‌రెడ్డి, కుంభం కొండల్‌గౌడ్, కేశమోని మధుగౌడ్, రాము, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేష్, రాము, నరేష్, రాజేష్‌గౌడ్‌తో పాటు మరో 50 మంది కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో మండలంలో ఆ పార్టీ కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. పార్టీలో చేరిన వారికి ముఖ్యమంత్రి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంకిత భావంతో పనిచేసే నాయకులకు, కార్యకర్తలకు పార్టీలో సముచితస్థానం ఉంటుందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

● వంగూరు ఎంపీపీ కాంగ్రెస్‌లోకి

బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వంగూరు ఎంపీపీ భీమమ్మ ఆ పార్టీకి రాజీనామా చేసి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆమెకు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా పార్టీలో ఆహ్వానించారు.

మైసమ్మ దేవత దర్శనం కోసం పోటెత్తిన భక్తులు



నాయినోనిపల్లి మైసమ్మ దేవతను దర్శనం చేసుకుంటున్న భక్తులు

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 28 : భక్తుల కొంగుబంగారంగా వెలసిన నాయినోనిపల్లి మైసమ్మ దేవత దర్శనం కోసం ఈ ఆదివారం భక్తులు పోటెత్తారు. నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, నారాయణపేట జిల్లాల నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 15వేలకు మందికి పైగా భక్తులు మైసమ్మ దేవతను దర్శనం చేసుకుని తమ తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తుల నుంచి ఈ ఆదివారం హుండీ ద్వారా 90వేల 800రూపాయలు, టికెట్ల ద్వారా 32వేలు మొత్తం ఒక లక్ష 22వేల ఆదాయం వచ్చినట్లు ఈవో రామేశ్వర్‌రావు, చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్‌లు తెలిపారు.

సీఎం రేవంత్‌కు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి

- మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి



పుల్జాల గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి

కందనూలు, ఏప్రిల్ 28 : రైతులను నమ్మించి మోసం చేసి గద్దెనెక్కిన రేవంత్‌కు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా నాగర్‌కర్నూల్ మండలంలోని పుల్జాల గ్రామంలో ఎన్నికల ప్రచారం చేసిన మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి గ్రామంలోని శివాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. గడప గడపకు తిరుగుతూ మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్ రైతులకిచ్చిన రైతుబంధు 15వేలు, కౌలు రైతులకు 15వేలు, వ్యవసాయ కూలీలకు 12వేలు ఇస్తామని చెప్పి ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. ప్రశ్నించే గొంతులను గెలిపించండి కాంగ్రెస్ మెడలు వంచి హామీలు అమలయ్యేలా చేస్తామన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీకి లక్షకుపైగా ఓట్లు పడతాయి



పట్టణంలో ప్రచారంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నాయకుడు మండికారి బాలాజీ

అచ్చంపేటటౌన్, ఏప్రిల్ 28: దేశంలో బీజేపీ ప్రభుత్వం మోదీ చేసిన సంక్షేమం, అభివృద్ధితో నియోజకవర్గంలో బీజేపీకి లక్షకుపైగా ఓట్లు పడతాయని బీజేపీ రాష్ట్ర నాయకుడు మండికారి బాలాజీ అన్నారు. ఆదివారం పట్టణంలోని పాతబజారుతో పాటు పలు కాలనీలలో పర్యటించి ఇంటింటి ప్రచారం నిర్వహించి మోదీ అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పదేళ్లలో నరేంద్రమోదీ పేద ప్రజలకోసం చేపట్టిన అనేక కార్యక్రమాలతో ఓటు అడుగుతున్నామన్నారు. ఉచితంగా ఇస్తున్న రేషన్ గురించి ప్రజలకు వివరిస్తున్నామన్నారు. కార్యకర్తలు పడ్డ కష్టానికి పార్లమెంట్ ఎన్నికల్లో ఫలితం రాబోతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న గ్యారెంటి పథకాలకు గ్యారెంటి లేకుండా పోయిందన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు చెప్పే మాటలు ప్రజలు పట్టించుకునే పరిస్థితుల్లో లేరన్నారు. ప్రతీ ఒక్కరు బీజేపీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌కు ఓటు వేసి గెలిపించాలన్నారు. నాయకులు రేణయ్య, వీరయ్య, రాజు, అలీం, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులపై సూర్యప్రతాపం



పెంట్లవెల్లిలో గిరాకీ లేక వెలవెలబోతున్న పండ్ల వ్యాపారం

పెంట్లవెల్లి, ఏప్రిల్ 28: సూర్యుడు మండిపోతున్నాడు.. జనం విలవిలలాడుతున్నారు.. గత నెల రోజులుగా రికార్డు స్థాయిలో ఎండలు తీవ్ర ప్రతాపాన్ని చూపుతున్నాయి. వీధి వ్యాపారాలు బేరాలు లేక వెలవెలబోతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ కేంద్రాలకు జనాలు రాక పోవడంతో పండ్ల వ్యాపారాలు ఇతర అమ్మకాలు జరగకపోవడంతో అమ్మకందారులు తీవ్రంగా నష్ట పోతున్నారు.

వేల రూపాయలు వెచ్చించి తెచ్చిన పండ్లు, కూరగాయలు ఎండ వేడిమికి త్వరగా పాడవుతున్నాయి. 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉండటంతో ప్రజలు ఎవరూ రోడ్లపైకి రాలేకపోతున్నారు. వడగాలులు పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

నడిరోడ్డుపై విద్యుత్ స్తంభం



నడిరోడ్డుపై ఉన్న విద్యుత్‌స్తంభం

తెలకపల్లి, ఏప్రిల్ 28 : మండల కేంద్రంలో ప్రధాన రహదారి అయిన పోలీస్‌స్టేషన్ నుంచి సిద్దార్థ మోడల్ స్కూల్ వరకు ఉన్న రహదారిలో నడిరోడ్డుపై విద్యుత్ స్తంభం ఉండి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సంబంధిత అధికారులు ప్రతి రోజు అటు వైపు వచ్చి పోతుంటారు తప్ప దానిని తొలగించాలని పక్కకు ఏర్పాటు చేయాలన్న ధ్యాస అధికారులకు లేకపోవడం శోచనీయమని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నడిరోడ్డుపై ఉన్న స్తంభాన్ని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలి

- ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి



ఇప్పలపల్లిలో దివ్యాంగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

తిమ్మాజిపేట, ఏప్రిల్ 28 : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ మల్లు రవిని గెలిపించేందుకు కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. తిమ్మాజిపేట మండల పరిధిలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త బంగారయ్య నిర్మించిన నూతన గృహ ప్రవేశం వేడుకల్లో పాల్గొని కాసేపు కార్యకర్తలతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి త్వరలో రైతులకు ఏకకాలంలో చేయనున్న రెండు లక్షల రుణమాఫీ అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, ఆదేవిధంగా ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించాలన్నారు. గ్రామాల్లో మాయమాటలు చెబుతూ ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్న బీజేపీ, బీఆర్‌ఎస్‌ల అవినీతి అక్రమాలను ప్రజలకు పూర్తి స్థాయిలో వివరించాలన్నారు. కాంగ్రెస్ ద్వారానే పేదల సంక్షేమం జరుగుతుందని, అభివృద్ధి పథకాలు అమలు అవుతాయన్నారు. అక్కడికి చేరుకున్న దివ్యాంగులతో మాట్లాడుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ దివ్యాంగులకు చేయూతనందించడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ మీకు ఎప్పుడు అండగా ఉంటుందని మీ ఓటు కాంగ్రెస్‌కు వేయాలన్నారు. ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త డాక్టర్ మల్లు రవిని గెలిపించడం కోసం కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారం చేపడితే సామాజిక న్యాయం సాధించనున్నట్లు, పెద్ద మెజార్టీ కోసం అహర్నిషలు శ్రమించాలన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దానం బాలరాజు, మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మాధవులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రవూఫ్, హర్షవర్ధన్‌రెడ్డి, నాగసాయిలు, మల్లేష్ ముదిరాజ్, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చెన్నకేశవస్వామి విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలు



ముష్టిపల్లి గ్రామంలో చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న చింతలపల్లి జగదీశ్వర్‌రావు

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 28 : మండల పరిధిలోని ముష్టిపల్లి గ్రామంలో చెన్నకేశవస్వామి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చెన్నకేశవస్వామి ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాల్లో తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ చింతలపల్లి జగదీశ్వర్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు చింతలపల్లి జగదీశ్వర్‌రావును శాలువాలతో ఘనంగా సన్మానించారు. అలాగే గంట్రావుపల్లి గ్రామంలో చెన్నకేశవస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం కనుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఖాజా, గ్రామ పెద్దలు కుర్మయ్య, గుర్రాల బాలయ్య, నాగేష్, శ్రీకాంత్, ఆలయ కమిటీ సభ్యులు గంట్రావుపల్లి గ్రామ పెద్దలు లక్ష్మణ్‌రావు, ప్రకాశ్‌రావు, శ్రీనివాస్‌రావు, బాబురావు, కోట్ల సుధాకర్, గోపాల్ పాల్గొన్నారు.

యంగంపల్లిలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

కల్వకుర్తి: మండలం యంగంపల్లి గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. ఉదయం నుంచి పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ధ్వజస్తంభ ప్రతిష్ఠకు కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, పలువురు నాయకులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పలువురు నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న భక్తులు

గాలి పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

చారకొండ: మండల పరిధిలోని తుర్కలపల్లిలో ఆదివారం గాలి పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం హోమం నిర్వహించారు. మహిళలు బోనం కుండలను అలంకరించి నెత్తిన పెట్టుకొని డప్పు వాయిద్యాల నడుమ గాలి పోచమ్మతల్లి దేవాలయం వద్దకు వెళ్లి అమ్మవారిని దర్శించుకొని నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చు కున్నారు. ఆలయ నిర్వాహకులు శ్రీశైలం, గ్రామస్థులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

వంగూరు: మండలంలోని పోల్కంపల్లిలో కనకదుర్గ మాత విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో భాగంగా ఆలయం వద్ద ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని భక్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులతో పాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయం వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. పార్టీల నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



ధ్వజస్తంభం ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

మంతటిలో పకడ్బందీగా కమ్యూనిటీ కాంటాక్ట్

- అడిషనల్ ఎస్పీ సీహెచ్.రామేశ్వర్



సరైన పత్రాలు లేని ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 28 : నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని మంతటి గ్రామంలో జిల్లా డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం 90మంది పోలీస్ సిబ్బందితో పది టీమ్‌లుగా ఏర్పడి కమ్యూనిటీ కాంటాక్ట్ పకడ్బందీగా నిర్వహించినట్లు జిల్లా అడిషనల్ ఎస్పీ సీహెచ్.రామేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మూడు చెక్‌పోస్టులు పెట్టి సరైన పత్రాలు లేని 38 ద్విచక్ర వాహనాలు, ఐదు ఆటోలు, 8.5 లీటర్ల లిక్కర్, కొంత ఇతరత్రా ఇంటి సామగ్రిని స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. స్వాధీనం చేసుకున్న వెహికిల్స్, ఇంటి సామగ్రికి సరైన పత్రాలు తీసుకొచ్చి వాళ్ల వెహికిల్, వస్తువులను తీసుకెళ్లాల్సిందిగా ఆయన గ్రామ ప్రజలకు సూచించారు. అలాగే పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత కల్పిస్తామని తెలియజేశారు. నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్, ముగ్గురు సీఐలు, పది మంది ఎస్ఐలు, 75మంది పోలీస్ సిబ్బందితో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో అన్ని వర్గాలకు సముచిత స్థానం

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

కల్వకుర్తి, ఏప్రిల్ 28 : రాష్ట్రంలో సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కొనసాగుతున్న ప్రజాపాలనలో అన్ని వర్గాలకు సముచిత స్థానం లభిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రజాపాలనకు ఆకర్షితులై ప్రతిపక్ష పార్టీలోని నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లోకి వలస బాట పట్టారని ఆయన పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలో బీఎస్‌ఆర్ కార్యాలయంలో కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ నేతృత్వంలో కల్వకుర్తి మాజీ జడ్పీటీసీ సభ్యులు సింగం బాలస్వామిగౌడ్, డొక్క హరిదాస్‌తో పాటు పలువురు నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు ఆదివారం ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు ప్రజా విశ్వాసాన్ని కోల్పోయాయని విమర్శించారు. పేదలకు ఎప్పుడూ అండగా ఉండేది కాంగ్రెస్ పార్టీనేనన్నారు. కాంగ్రెస్‌తోనే సబ్బండ వర్గాలకు న్యాయం చేకూరుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ 12 స్థానాల్లో ఎంపీ అభ్యర్థులు విజయఢంకా మోగించబోతున్నారని జోస్యం చెప్పారు. ఇండియా కూటమి అత్యధిక స్థానాలు సాధించి ప్రధానిగా రాహుల్‌గాంధీ కావడం ఖాయమని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో వెల్దండ మాజీ సర్పంచ్ ఎన్నం భూపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు షానవాజ్‌ఖాన్, రమాకాంత్‌రెడ్డి, హనుమానాయక్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జిల్లెల రాములు, దామోదర్‌రెడ్డి, లింగారెడ్డి, నాని, శ్రీకాంత్, సంతుయాదవ్, సురేష్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో ఎంపీ అభ్యర్థి పూజలు

● ఎంపీ రాములుతో కలిసి ఎన్నికల ప్రచార రథాన్ని ప్రారంభించిన భరత్ ప్రసాద్



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న భరత్ ప్రసాద్

అమ్రాబాద్, ఏప్రిల్ 28: అవినీతి అక్రమాలకు తావివ్వకుండా పదేళ్ల పరిపాలనలో తన నాయకత్వ ప్రదర్శన ద్వారా ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్న నరేంద్రమోదీ మూడోసారి ప్రధాన మంత్రి కావాలని మద్దిమడుగు ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసినట్లు నాగర్‌కర్నూల్ బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని మద్దిమడుగు ఆంజనేయస్వామి ఆలయంలో నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు, బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇప్పలపల్లి, వంకేశ్వరం, పదర, అమ్రాబాద్, మన్ననూర్ తదితర గ్రామాల్లో రోడ్ షో ద్వారా ప్రచారం నిర్వహించి బీజేపీకి ఓటు వేసి తనను గెలిపంచాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గత మూడు దశాబ్దాల కాలంలో ఈ ప్రాంతంలో ప్రజలకు ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలు తీసుకొచ్చినట్లు ఎంపీ రాములు గుర్తు చేశారు. ఉమ్మడి అమ్రాబాద్ మండలంలో పలు విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు ఎంపీ పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ తరుపున ఎంపీ అభ్యర్థిగా పోటి చేస్తున్న తన కుమారుడు భరత్ ప్రసాద్‌ను ప్రజలు ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించి దీవించాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ జిల్లా నాయకులు జక్కా రఘునందన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మండల నాయకులు గోలి రాజు, శ్రీనివాసులు, చంద్రయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడికి ఆర్థిక సహాయం

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 28 : మండల పరిధిలోని వెన్నచెర్ల ఉన్నత పాఠశాలలో 1985 సంవత్సరంలో పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన చింతకుంట బాలపీరుకు తోటి మిత్రులు ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. చింతకుంట బాలపీరు పక్షవాతం వ్యాధి వచ్చి కాళ్లు చేతులు పడిపోయి నోటి ద్వారా మాటలు కూడా సరిగ్గా రావడం లేదు. 1985 సంవత్సరంలో పదవ తరగతి చదివిన ఆ బ్యాచ్‌కు చెందిన మిత్రులు నెలకు 2వేల చొప్పున సంవత్సరం పాటు ఆర్థిక సహాయం చేయాలని ముందుకొచ్చారు. ఆదివారం బాలపీరుకు తోటి మిత్రులు కొంత ఆర్థిక సహాయం అందజేశారు. గుర్రం శ్రీనివాసులు, ఎండి.బాబుమీయా, జి.శ్రీరామచారి, యాదగిరి, మాధవచారి, డీఎల్ పాండు, రామారావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏకలవ్య పాఠశాల ప్రవేశ పరీక్ష

వెల్దండ, ఏప్రిల్ 28 : మండలంలోని గుండాల ఏకలవ్య పాఠశాలలో 2024 - 25 విద్యాసంవత్సరానికిగాను 6వ తరగతి విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. కేంద్రానికి కేటాయించిన 360 మంది విద్యార్థులకుగాను 292 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్షను ఆర్‌సీవో నాగార్జునరావు, ప్రిన్సిపాల్ సరస్వతి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటనారాయణ పరీక్షను పర్యవేక్షించారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

వెల్దండ, ఏప్రిల్ 28 : పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ బీజేపీ నాయకులు ఆదివారం ఇంటింటి ప్రచారాలు నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యెన్నం శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు చెదురుపల్లి, చెర్కూర్, ఎంజీకాలనీ, శంకరకొండ, బర్కత్‌పల్లి, కొట్రతండా, నారాయణపూర్ గ్రామాల్లో మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ స్థానికులకు కరపత్రాలు పంచారు. కేంద్రంలో మరో మారు మోదీ సర్కార్ రాబోతుందని ఈ సందర్భంగా వారు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు జంగయ్య యాదవ్, బాలస్వామి, మధుసూదన్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, అరుణ్ నాయక్, శ్రీను, మధు, హన్మంతు, పాండు, మేగ్య తదితరులు ఉన్నారు.

కొల్లాపూర్: మునిసిపాలిటీ పరిధిలోని 14వ వార్డు బోయలపల్లి గ్రామంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ గెలుపు కోరుతూ బీజేపీ నాయకులు ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సందు రమేష్ మాట్లాడుతూ త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. నరేంద్ర మోదీ మూడవసారి దేశానికి ప్రధానమంత్రి కాబోతున్నారని ప్రజలంతా బీజేపీ వైపే ఉన్నారని అయన ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ప్రజలను కలిసి బీజేపీ మేనిఫెస్టోను వివరిస్తూ ఓటును అభ్యర్థించారు. బీజేపీ దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కద్మాల కృష్ణ, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కాశిపురం మహేష్, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఎల్లయ్య, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు మెంటే శివకృష్ణ, కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షుడు బాలకృష్ణ, నాయకులు మద్దిలేటి, కుర్మయ్య, రమేష్, ధర్మరాజ్ పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో కరపత్రాల ఆవిష్కరణ



ఆవంచలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు

తిమ్మాజిపేట, ఏప్రిల్ 28 : యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దానం బాలరాజు ఆధ్వర్యంలో గ్యారెంటీ పథకాలకు సంబంధించిన కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. తిమ్మాజిపేట మండలంలోని ఆవంచ, రాళ్లచెరువుతండా, బుద్ధసముద్రం తదితర గ్రామాల్లో యువజన కాంగ్రెస్ నాయకులతో సమావేశాలు నిర్వహించి ఐదుగురు చొప్పున కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులతో కలిసి ఆయా గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంచుతూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ మల్లు రవి గెలుపు కోసం అందరూ కలిసి రావాలన్నారు. గ్రామాల్లో యువకులు కాంగ్రెస్ పార్టీ పథకాల అమలుపై ప్రచారం జోరుగా నిర్వహించి మెజార్టీ కోసం శ్రమించాలన్నారు. యువజన కాంగ్రెస్ నాయకులు వరుణ్‌కుమార్, సహదేవ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

కల్వకుర్తి, ఏప్రిల్ 28 : కల్వకుర్తి పట్టణంలో పలు కళాశాలల్లో లెక్చరర్‌గా పని చేసిన వెంకటయ్యయాదవ్ అనారోగ్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న మిత్ర ఫౌండేషన్ సభ్యులు బాధిత కుటుంబానికి ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. మిత్ర ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ



కంసానిపల్లిలో పెద్దమ్మతల్లి బోనాలతో మహిళలు

ఉప్పునుంతల, ఏప్రిల్ 28: మండల పరిధిలోని కంసానిపల్లి గ్రామంలో ఆదివారం యాదవుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లి బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవులు భక్తిశ్రద్ధగా మహిళలు కొత్త కుండకు పసుపు కుంకుమ పూలు అలంకరించి ప్రత్యేకంగా వండిన నైవేద్యం బోనంలో పెట్టి డప్పు చప్పులతో గ్రామ వీధుల నుంచి ఊరేగింపుగా వెళ్లి పెద్దమ్మ తల్లి అమ్మవారి వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా అమ్మవారికి నైవేద్యం సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. యాదవులు, నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

తెలకపల్లి, ఏప్రిల్ 28 : ప్రతి ఒక్కరు దైవచింతన కలిగి ఉండాలని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. మండలం గట్టునెల్లికుదురులో ఆదివారం బీరప్ప పండుగ వేడులకు ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సూర్యబాలగౌడ్, మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.